


పొట్టి శ్రీరాములు ఆదర్శనీయులు: కలెక్టర్


నివాళులర్పిస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్

ప్రజాశక్తి -తిరుపతి టౌన్: అమరజీవి పొట్టి శ్రీరాములు భాషా ప్రయుక్త రాష్ట్రాలకు ఆద్యులు అని, అమరజీవి అని, వారి సేవలు చిరస్మరణీయం భావితరాలకు ఆదర్శనీయం అని కలెక్టర్ డాక్టర్ ఎస్ వెంకటేశ్వర్ పేర్కొన్నారు. స్థానిక కలెక్టరేట్ సమావేశ మందిరంలో వెనుక బడిన తరగతుల సంక్షేమ శాఖ ఆదివారం ఏర్పాటు చేసిన పొట్టి శ్రీరాములు వర్ధంతి సభలో కలెక్టర్ ఆయన చిత్ర పటానికి సంబంధిత అధికారులతో కలిసి పుష్పాంజలి ఘటించి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అమరజీవి పొట్టి శ్రీరాములు 58 రోజులు అకుంఠిత దీక్షతో ఆమరణ నిరాహార దీక్ష చేసి అమరులై ఆంధ్ర రాష్ట్రాన్ని సాధించారన్నారు. అంతటి గొప్ప వ్యక్తి గురించి తెలుసుకోవడం భావితరాలకు కూడా తెలపాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి నరసింహులు, సహాయ బిసి సంక్షేమ అధికారిణి జ్యోత్స్న, బిసి సంక్షేమ అధికారులు, వివిధ శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

వివక్ష వద్దు..సహకరించాలి..

కేరళ సంఘీభావ సదస్సులో సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్ నర్సింగరావు



మాట్లాడుతున్న సిఐటియు జిల్లా అధ్యక్షులు జి బాలసుబ్రహ్మణ్యం

ప్రజాశక్తి- తిరుపతి టౌన్: దేశంలో అన్ని రంగాల్లో గణనీయ అభివృద్ధి సాధిస్తూ ఆదర్శంగా నిలుస్తున్న కేరళ వామపక్ష ప్రభుత్వానికి కేంద్ర ప్రభుత్వం సహకారం అందించక వివక్ష పాటించడం సరికాదని సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్ నర్సింగరావు అన్నారు. తిరుపతి వేమన విజ్ఞాన కేంద్రంలో ఏపీ రైతు సంఘం, సిఐటియు, ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో కేరళ సంఘీభావ సదస్సు ఆదివారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన సిహెచ్ నర్సింగ్ రావు మాట్లాడుతూ కేంద్రంలో మోడీ ప్రభుత్వం వామపక్ష ప్రభుత్వానికి అడుగడుగునా అడ్డంకులు సృష్టించి నిధులు ఇవ్వకుండా పడగొట్టే చర్యలకు యత్నిస్తోందని దీన్ని మేధావులు, ప్రజాస్వామ్యవాదులు అడ్డుకోవాలన్నారు. కేరళలో వామపక్ష ప్రభుత్వం అధికారంలోకొచ్చిన నాటి నుంచి భూ సంస్కరణలు అమలు చేసి ప్రతి పేదవాడికీ భూమి పంచిందని, కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు అమలు చేస్తోందని, చౌక దుకాణాల ద్వారా పేదలకు 16 రకాల నిత్యావసర వస్తువులు పంపిణీ చేస్తూ ఆదుకుంటోందన్నారు. ఇల్లు లేని ప్రతి పేదవాడికీ వామపక్ష ప్రభుత్వం ఇల్లు నిర్మిస్తోందని, విద్య, వైద్య రంగానికి అధిక ప్రాధాన్యత ఇస్తోందని, 100 శాతం అక్షరాస్యత సాధించి అందరికీ ఆదర్శంగా నిలుస్తోందన్నారు. కోవిడ్ సమయంలో కేరళ రాష్ట్రం వైద్యపరంగా ఉత్తమ సేవలు అందించిందని, రైతుల పంటలకు అధిక గిట్టుబాటు ధర కల్పిస్తోందని గుర్తు చేశారు. ఆహార ధాన్యాల ఉత్పత్తిలో ఆదర్శంగా వున్నా కేంద్రంలో బిజెపి, ఆర్ఎస్ఎస్‌లు కేరళ ప్రభుత్వాన్ని విచ్ఛిన్నం చేయడానికి కుట్రలు పన్నుతోందన్నారు. ఇటీవల వయనాడు జిల్లాలో వరదలు వచ్చి 400 మంది మృతి చెందినా కేంద్రం పైసా ఇవ్వలేదని, వామపక్ష ప్రభుత్వమే వారికి ఆర్థిక సహాయం, ఇళ్ల నిర్మాణం చేపట్టిందన్నారు. త్రివేంద్రం విమానాశ్ర యాన్ని అదానికి అప్పగించడంపై పోరాటం చేసి చివరకు సుప్రీంకోర్టును ఆశ్రయించిందన్నారు. లాభాలు వస్తున్న భారత పెట్రోల్ సంస్థను ప్రైవేట్ వ్యక్తుల కు అప్పగింతకు యత్నిస్తోందని, తామే నిర్వహిస్తామని కేరళ ప్రభుత్వం హితవు పలికింద న్నారు. కేంద్రం నిధులు ఇవ్వ కుండా మతోన్మా దాన్ని పెంచి కేరళలో మతోన్మాద ప్రభుత్వా న్ని ఏర్పాటు చేయడానికి యత్నిస్తున్నా అక్కడ ప్రజలు ఐక్యంగా అడ్డుకుంటు న్నారన్నారు. వామపక్ష ప్రభుత్వం లౌకికత్వానికి, ప్రజాస్వామ్య పరిరక్షణకు పాటుపడుతోందన్నారు. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళి మాట్లాడుతూ. కేరళలో వామపక్ష ప్రభుత్వాన్ని విచ్ఛిన్నం చేయడానికి బిజెపి, ఆర్ఎస్ఎస్ అడుగడుగునా మతోన్మాదాన్ని పెంచి పోషిస్తోందని, దాన్ని వామపక్ష ప్రభుత్వం అడ్డుకోవడమే కాకుండా ప్రజల మధ్య మత విద్వేషాలు రాకుండా ఉండేందుకు చర్యలు తీసుకుం టోందన్నారు. సిపిఎం జిల్లా కార్యదర్శి వి నాగరాజు మాట్లాడుతూ 1957లో వామపక్ష ప్రభుత్వం కేరళలో భూ సంస్కరణలు తీసుకు రావడంతో అప్పటి ప్రధాని నెహ్రూ కూడా దేశంలో భూ సంస్కరణలు తీసుకొచ్చారే కానీ వాటిని సరిగా అమలు చేయలేదని గుర్తు చేశారు. కేరళలో ప్రతి పేదవాడికీ సొంతిల్లు, ఉపాధి, విద్య, వైద్యం ప్రభుత్వ రంగంలో ఉచితంగా అందిస్తోందని తెలిపారు. అందుకే వామపక్ష ప్రభుత్వాన్ని అక్కడ ప్రజలు ఆదరిస్తున్నారని గుర్తు చేశారు. కేరళలో పలు ఆలయాల్లో దళితులను అర్చకులుగా నియమించిన ఘనత వామపక్ష ప్రభుత్వానికి దక్కిందన్నారు. దళిత వర్గానికి చెందిన వ్యక్తినే దేవదాయ శాఖ మంత్రిని చేసి ఆదర్శంగా నిలిచారన్నారు. ఈ సమావేశంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు జి బాలసుబ్రహ్మణ్యం అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పి హేమలత పాల్గొన్నారు.

శ్రీవారికి కాసుల పంట..!

- రికార్డు స్థాయిలో హుండీ ఆదాయం
- డిసెంబర్ చివరికి రూ.1,350 కోట్లు దాటే అవకాశం

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో: శ్రీవారి హుండీ ఆదాయం నెల నెలా పెరుగుతోంది.. 33 నెలలుగా హుండీ ఆదాయం సెంచరీలు కొడుతోంది. తాజాగా ఆగస్టు లో హుండీ ఆదాయం రికార్డులు బద్దలు కొట్టింది.

తిరుమలేశుడి హుండీ ఆదాయం ప్రతి నెలా రూ. వంద కోట్లకు తగ్గేదే లేదన్నట్లు వస్తోంది. వెంకన్న ఆదాయం అంతకంతకూ పెరుగుతోంది. ఈ ఏడాది మొదటి 10 నెలల్లో రూ 1142.43 కోట్లకు చేరింది. తిరుమల వెంకన్న ఆదాయం నవంబర్ నెలలో రూ 111.30 కోట్లు వచ్చింది. దీంతో తిరుమల శ్రీవారికి 11 నెలల ఆదాయం కాస్తా రూ.1253.73 కోట్లకు చేరుకుంది. ఈ మధ్య కాలంలో గణనీయంగా పెరిగిన భక్తుల రద్దీ తగ్గట్టుగానే హుండీ ఆదాయం రికార్డు స్థాయిలో నమోదు అవుతోంది. శ్రీవారికి కానుకలు సమర్పించే భక్తులు తిరుమలేశుడి ఆస్తుల విలువను అమాంతంగా పెంచుతున్నారు. వెల కట్టలేని వజ్ర వైడూర్యాలు, బంగారు ఆభరణాలు వెంకన్న సొంతం. కాగా ఈ ఏడాది మొదటి 6 నెలల హుండీ ఆదాయం రూ 670.21 కోట్లుగా శ్రీవారి ఖాతాకు జమ అయ్యింది.

శ్రీవారి ఆదాయం రికార్డులను చూస్తే.. 2015-2016లో ఏకంగా రూ.1,010 కోట్ల సంవత్సర ఆదాయం లభించింది.. కరోనాకు ముందు బాగానే ఉన్న ఆదాయం ఆ తర్వాత తగ్గిపోయింది. ఇప్పుడు భక్తుల సంఖ్య పెరుగుతుండటంతో ఆదాయం కూడా ఊహించని స్థాయికి



చేరింది.

ఈ ఏడాది జనవరి నెలలో రూ.116.46 కోట్లు, ఫిబ్రవరిలో రూ.111.71 కోట్లు, మార్చి నెలలో రూ.118.49 కోట్లు, ఏప్రిల్ నెలలో రూ.101. 63 కోట్లు, మేలో రూ.108.28 కోట్లు, జూన్‌లో రూ. 113.64 కోట్లు, జులైలో రూ.125.35 కోట్లు, ఆగస్టులో రూ .25.67 కోట్లు, సెప్టెంబర్‌లో రూ .14.11 కోట్లు, అక్టోబరులో రూ.107.30 కోట్లు, నవంబరులో రూ .11.30 కోట్లు హుండీ కానుకల రూపంలో శ్రీవారి ఆదాయం టీటీడీ ఖాతాకు చేరింది.

ప్రతి నెలా శ్రీవారిని దర్శించుకున్న భక్తులు, భక్తులు సమర్పించిన కానుకల వివరాలను డయల్ యువర్ ఈవో కార్యక్రమంలో తిరుమల తిరుపతి దేవస్థానం వెల్లడించింది. ఈ ఏడాదిలో అత్యధిక ఆదాయం ఆగస్టు నెలలోనే వచ్చినట్లు టీటీడీ లెక్కలు చెబుతున్నాయి. ఆగస్టు నెలలో శ్రీవారికి ఏకంగా 22.42 లక్షల మంది భక్తులు దర్శించుకోగా, శ్రీవారి హుండీ ఆదాయం రూ. 125.67 కోట్లు వచ్చినట్లు టీటీడీ ప్రకటించింది. ఆగస్టులో 1.06 లక్షల లడ్డూలను విక్రయించిన టీటీడీ 24.33 లక్షల మంది భక్తులు అన్న ప్రసాదం స్వీకరించినట్లు ప్రకటించింది. గత 33 నెలలుగా తిరుమల వెంకన్న ఆదాయం రూ. 100 కోట్ల మార్కును దాటుతోంది. 2022 మార్చి నుంచి తిరుమలేశుడి హుండీ ఆదాయం ప్రతినెల రూ.100 కోట్లకు తగ్గకుండా టీటీడీ ఖాతాకు జమ అవుతూనే ఉంది. సామాన్య భక్తుల నుండి సంపన్నుడి దాకా హుండీలో సమర్పిస్తున్న కానుకల విలువ వెల్లువలా కొనసాగుతుండడంతో 2024 ఏడాది పూర్తి అయ్యే సరికి హుండీ ఆదాయం రూ. 1360 కోట్లకు పైగానే ఉంటుందని టిటిడి అంచనా వేస్తోంది.

ప్రత్యేక రైలు ప్రయాణం నరకం!

- తక్కువ దూరం ఉన్నా గంటల ప్రయాణం
- అధిక ఛార్జీల బాదుడు
- పాత రైళ్లు డొక్కు బోగీలు..

ప్రజాశక్తి -తిరుపతి టౌన్: పండుగ వేళల్లో స్వస్థలానికి వెళ్లాలన్నా, సెలవు రోజుల్లో విహార యాత్ర వెళ్లాలనుకున్నా చాలామంది ప్రజలు రైలును ఆశ్రయిస్తారు. రైళ్లల్లో ప్రయాణించాలంటే అలసట ఉండదు.. సుఖంగా, ప్రశాంతంగా ప్రయాణించాలనే వారి కోసం దక్షిణ మధ్య రైల్వే ప్రత్యేక రైలు ఏర్పాటు చేస్తుంటారు. సాధారణ రైళ్లల్లో రిజర్వేషన్లు దొరకని వారు కొంత ఖర్చైనా రిజర్వేషన్ చేసుకుంటే బెర్త్ దొరుకుతుందని ప్రత్యేక రైళ్లను ఆశ్రయిస్తారు. అయితే ఆ ప్రత్యేక రైళ్ల ప్రయాణం ప్రయాణికులకు నరకంగా మారుతున్నాయి. సుమారు 200 కిలోమీటర్లు ప్రయాణించాలంటే నాలుగు నుంచి ఐదు గంటలకు సమయం పడుతుంది. దీంతో ప్రయాణికులు బేజారు చెందుతున్నారు. దక్షిణ మధ్య రైల్వే పరిధిలో నడిచే ప్రత్యేక రైలు ఎప్పుడు ఏ ప్లాట్ ఫారంలో వస్తుందో తెలియదు. ఏ సమయంలో వచ్చేది కూడా ఆఖరి నిమిషం వరకు తెలియదు. ప్రత్యేక రైలు ప్లాట్‌ఫారం మీదికి వచ్చిన తర్వాత లగేజ్ అంతా తీసుకొని పరుగులు తీసి రైలు వచ్చిన ప్లాట్ ఫామ్ మారాల్సి ఉంటుంది. మార్గ మధ్యంలో ఎన్ని సార్లు ఆగుతుందో... ఆగినప్పుడు మళ్లీ ఎప్పుడు కదులుతుందో తెలియని పరిస్థితి. అధిక ఛార్జీలు చెల్లించి మరి ప్రయాణంలో ప్రత్యక్ష నరకాన్ని చూడాల్సిన పరిస్థితి. ప్రత్యేక రైలులో నెలకొన్నాయి.12744 నెంబర్ కలిగిన తిరుపతి నారాయణాద్రి ఎక్స్‌ప్రెస్ ఆలస్యంగా నడవడం పట్ల తిరుపతికి వచ్చే యాత్రికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ రైలు ప్రతి రోజూ ఏదో ఒక సమయం కొంత ఆలస్యంగా వస్తోందని ప్రయాణికులు ఆరోపిస్తున్నారు.

కాకినాడ నుంచి కొల్లం వరకు... ఈ నెల 11, 18, 25 తేదీల్లో కాకినాడ- కొల్లం (07173) ప్రత్యేక రైలు కాకినాడ పోర్టులో రాత్రి 11.50 గంటలకి బయలుదేరి రెండో రోజు ఉదయం 5.30 గంటలకు కొల్లం చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో కొల్లం-కాకినాడ (07174) ప్రత్యేక రైలు 13, 20, 27 తేదీల్లో కొల్లంలో ఉదయం 8.40 గంటలకు బయలుదేరి రెండోరోజు సాయంత్రం 4 గంటలకు కాకినాడ పోర్టుకు చేరుకుంటుంది. ఈ రైలుకు కొట్టాయం, ఎర్నాకుళం, త్రిసూర్, ఈరోడ్, సేలం, జోలార్ పేట్, కాట్పాడి, చిత్తూరు, తిరుపతి, రేణిగుంట, గూడూరు, నెల్లూరు, ఒంగోలు, చీరాల, తెనాలి, విజయవాడ, గుడివాడ, కైకలూరు, ఆకివీడు, భీమవరం, తణుకు, నిడదవోలు, రాజమండ్రి, సామర్లకోట, కాకినాడ టౌన్ స్టేషన్లలో హాల్టింగ్ సౌకర్యాన్ని కల్పించారు. ఈ ప్రత్యేక రైలు కూడా సమయం రాక కొంత ఆలస్యంగా నడుస్తున్నాయని ఈనెల 13వ తేదీ ప్రయాణం చేసిన ప్రయాణికులు పేర్కొన్నారు. తిరుపతి రైల్వే స్టేషన్లో ప్రత్యేక రైలు నడపాలంటేనే అధికారులకు సమస్య తలనొప్పిగా ఉంటుంది. ప్రస్తుతం ఈ రైల్వే స్టేషన్ ఆధునీకరణ పనులు జరుగుతున్నాయి. ప్రత్యేక రైళ్లు నడపలేని పరిస్థితి వుంది. కొన్ని ప్రత్యేక రైళ్లు మాత్రమే నడిపిస్తున్నారు.

ప్రత్యేక రైళ్లపై తీవ్ర విమర్శలు

ప్రత్యేక రైళ్లపై ప్రయాణికులు తీవ్ర విమర్శలు గుప్పిస్తున్నారు. ఛార్జీలు అధికంగా వసూలు చేయడంతో పాటు ప్రతి రోజూ నడిచే రైళ్లకు క్రాసింగ్ ఇచ్చేందుకు గంటల తరబడి స్టేషన్లలో నిలిపివేస్తున్నారని, దీనివల్ల అనుకున్న సమయానికన్నా చాలా చాలా ఆలస్యంగా గమ్యస్థానానికి చేరుకోవాల్సి వస్తోందని వాపోతున్నారు. దీనిపై అధికారులు స్పందించారు. సరైన సమయానికే వీటిని నడుపుతున్నామని చెబుతున్నారు. కానీ వాస్తవంలో చాలా ఆలస్యమవుతున్నాయి. ఐదు గంటల జర్నీకే ఎనిమిది గంటల జర్నీ చేయాల్సి వస్తోందంటూ దూర ప్రాంతాలకు వెళ్లే రైళ్లల్లో ఎన్ని గంటలు అదనంగా జర్నీ చేయాలో అర్థం చేసుకోవచ్చు. ఇకనైనా ఛార్జీలు ఎక్కువగా తీసుకుంటూ ఆలస్యంగా తీసుకువెళుతున్న రైళ్ల సమయ పాలనను మార్చాలని ప్రయాణికులు డిమాండ్ చేస్తున్నారు.

వృద్ధులు వికలాంగులు ఇబ్బందులు

దక్షిణ మధ్య రైల్వే ప్రధాన మార్గాలకు అధికంగా డిమాండు వుంది. సెలవు రోజుల్లో అధికంగా కనిపిస్తుంది. ఇలాంటి సమయంలో ప్రయాణికులకు అవసరాలకు అనుగుణంగా రేకుల రైలు వేయాల్సిన అధికారులు అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారు. ప్రత్యేక రైలు అంటే పండుగలు , వేసవి సెలవు రోజుల్లో ఉంటాయి. దక్షిణ మధ్య రైల్వే మాత్రం వివిధ మార్గాల్లో అనేక సంవత్సరాలు నుంచి ప్రత్యేక పేరుతో రైళ్లను నడిపిస్తుంది. రెగ్యులర్‌గా మారిస్తే సాధారణ ఛార్జీలు వసూలు చేయాల్సి ఉంటుంది. ప్రత్యేక రైలు నడిపిస్తే అదనపు ఛార్జీలు వసూళ్లకు వెసులుబాటు ఉంటుంది. ఈ ప్రత్యేక రైల్లో ప్రయాణంలో అంతులేని జాప్యం అవుతూ ఉండడంతో వృద్ధులు వికలాంగులు చంటి పిల్లలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

పాత రైళ్లు.. డొక్కు బోగీలు



నడుపుతున్న ప్రత్యేక రైళ్లలో ఎక్కువగా పాత రైళ్లు డొక్కు బోగిలే అధికంగా ఉంటున్నాయి. ఈ రైళ్లలో మరో దొడ్లల్లో నీళ్లు అయిపోయినా, బోగిలో అపరిశుభ్రంగా మారినా పట్టించుకునే నాథుడు ఉండరు. తిరుపతి సికింద్రాబాద్ నారాయణాద్రి ఎక్స్‌ప్రెస్‌లో చాలామంది ప్రయాణికులు మరుగుదొడ్లు నీళ్లు రావడం లేదని బోగీలు అపరిశుభ్రంగా ఉన్నాయని ఫిర్యాదులు చేసినా తూతూ మంత్రంగా చర్యలు చేపట్టి చేతులు దులుపుకున్నారు. ఇలా వివిధ రూట్లో తిరిగి ప్రత్యేక రైలు ప్రయాణ సమయాలు ఛార్జీలు రెగ్యులర్ రైళ్ల కంటే అధికంగా ఉంటున్నాయి.

ప్రత్యేక రైళ్లలో అదనపు బాదుడు

తరగతి....	కనిష్టం....	గరిష్టం
స్లీపర్	100	200 ఆపైన
త్రీ టైర్ ..	300	500 ఆపైన
సెకండ్ ఏసి	300 .	630 ఆపైన


మాట్లాడుతున్న కేంద్ర మంత్రి గిరిరాజ్ సింగ్

చేనేతకు అధిక ప్రాధాన్యత

కేంద్ర మంత్రి గిరిరాజ్ సింగ్

ప్రజాశక్తి- తిరుపతి బ్యూరో: కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో చేనేత కార్మికుల ఆర్థిక స్థితి మెరుగుకు ప్రాధాన్యత ఇస్తామని మార్కెట్ నెట్‌వర్క్ విస్తరణ, చేనేత ఉత్పత్తులకు న్యాయమైన ధర నిర్ధారణ కు కృషి చేస్తామని కేంద్ర చేనేత, జౌళిశాఖ మంత్రి గిరిరాజ్ సింగ్ అన్నారు. స్థానిక పద్మావతి అతిథి గృహంలో కేంద్ర చేనేత, జౌళి శాఖ మంత్రి, రాష్ట్ర బిసి సంక్షేమ, చేనేత శాఖ మంత్రి ఎస్.సవిత, రాష్ట్ర చేనేత, జౌళి శాఖ కమిషనర్ రేఖా రాణిలతో కలిసి చేనేత, ఆప్కో, టెక్స్‌టైల్స్ రంగాల అభివృద్ధిపై సంబంధిత అధికారులతో ఆదివారం మధ్యాహ్నం సమీక్షించారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి మాట్లాడుతూ దేశంలో చేనేత రంగాన్ని కాపాడి, అభివృద్ధి చేయాలని కేంద్ర ప్రభుత్వం ప్రయత్నిస్తోందన్నారు. కార్మికుల ఆరోగ్య, విద్య అవసరాల కోసం ప్రత్యేక శ్రద్ధ వహిస్తామని, రాష్ట్ర ప్రభుత్వంలో గల చేనేత కార్మికులకు కావలసిన సదుపాయాలను కల్పిస్తామని, వారికి అండగా కేంద్ర ప్రభుత్వం సహాయ సహకారాలు అందిస్తుందని తెలిపారు. చిన్న, సన్న చేనేత కార్మికులకు మగ్గాలు ఏర్పాటు కు కావలసిన నిధులను మంజూరు చేస్తామని తెలిపారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్ర మంత్రి సవితతో సమీక్షా సమావేశం నిర్వహించామని, చేనేత, హస్త కళలపై సంపదను సృష్టించే అంశంపై సమీక్షించి అభివృద్ధి కృషి చేస్తామని, టెక్స్‌టైల్స్, కళంకారి, హస్తకళ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం అన్ని విధాల రాష్ట్ర ప్రభుత్వానికి సహకరిస్తుందని తెలిపారు. రాష్ట్ర మంత్రి సవిత మాట్లాడుతూ రాయలసీమ జిల్లాల్లో చేనేత ఉత్పత్తుల తయారీపై కేంద్ర మంత్రికి వివరించారు. చేనేత కార్మికుల సమగ్ర సంక్షేమ పథకం, నూలు సరఫరా పథకం, నేత కార్మికుల ముద్ర స్కీం వంటి వాటిపై అవగాహన కల్పించాలని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెట్టే పథకాలను సద్వినియోగం చేసుకుంటే చేనేత కార్మికుల జీవితాల్లో వెలుగులు నిండే అవకాశం ఉందన్నారు. కమిషనర్ రేఖారాణి మాట్లాడుతూ రాష్ట్రంలో చేనేత, జౌళి రంగాల వారికి కాటన్ రీసైకిల్, ఫైబర్ పాలిస్టర్‌తో కాటన్ జోడించడం, జూట్ సాగు ఉత్పత్తి సాగు విస్తీర్ణం, జనపనార ఉత్పత్తి పెంచడం, చేనేత వస్త్రాలను వాడకంలోకి తీసుకురావడం, వాటి విలువ పెంచడం మార్కెటింగ్, హస్తకళలు, చేనేతరంగం అభివృద్ధి, కేంద్ర సామగ్రి , ఎగుమతులు పెంచడం, కాటన్ రీసైకిల్ ఉత్పత్తులు వాడకం ద్వారా చేనేత వాడకం పెంచడం, వృత్తి నైపుణ్య శిక్షణ, చేనేత కార్మికులకు పని కల్పన మొదలైన అంశాలు, నూలు దిగుమతులు తగ్గించి ఉత్పాదకత పెంచడం వల్ల చేనేత రంగానికి పూర్వ వైభవం తీసుకురావచ్చన్నారు. ఈ కార్యక్రమంలో ఆప్కో, హ్యాండ్లూమ్స్ వైస్ ఛైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ ఎం విశ్వ, హ్యాండ్ లూమ్స్ టెక్స్‌టైల్స్ అడిషనల్ డైరెక్టర్ శ్రీకాంత్ ప్రభాకర్, అసిస్టెంట్ డైరెక్టర్ రమేష్ సంబంధిత అధికారులు పాల్గొన్నారు.


ఐక్యత చాటుతున్న ఏపీ ఖజానా, లెక్కల శాఖ ఉద్యోగులు

ఐక్యతతో ఉద్యోగోన్నతుల సాధన

- ఏపీ ఖజానా, లెక్కల శాఖ సంఘం రాష్ట్ర కమిటీ ఎన్నిక
- అధ్యక్షులు, కార్యదర్శులుగా రవికుమార్, రాజ్‌కుమార్


ప్రజాశక్తి-తిరుపతి(మంగళం):

రాష్ట్ర నూతన ప్రభుత్వానికి తమ సంఘం అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందిస్తుందని, ఉద్యోగుల ఐక్యతతో ఉద్యోగోన్నతులు సాధిస్తామని ఇందుకు ప్రభుత్వం చొరవ చూపాలని ఆంధ్రప్రదేశ్ ఖజానా లెక్కల శాఖ సంఘం రాష్ట్ర కమిటీ నేతలు పేర్కొన్నారు. తిరుపతి-కరకంబాడి మార్గంలోని ఓ ప్రైవేటు ఫంక్షన్ హాల్ లో ఆంధ్రప్రదేశ్ ట్రెజరీస్ అండ్ అకౌంట్స్ సర్వీసెస్ అసోసియేషన్ అమరావతి, విజయవాడ శాఖల ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించి నూతన రాష్ట్ర కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన రాష్ట్ర అధ్యక్షులు గోవిందు రవి కుమార్, ప్రధాన కార్యదర్శి కాజ రాజ్ కుమార్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ ఖజానా, లెక్కల శాఖలో దీర్ఘకాలికంగా ఉన్న పెండింగ్ సమస్యలను శాఖ ఉద్యోగుల ఐక్యతతో పరిష్కరించుకొని పదోన్నతులను కల్పిస్తామన్నారు. ప్రభుత్వ ఆర్థిక శాఖలో ఎంతో కీలకమైన బాధ్యతలు నిర్వహిస్తున్న ఖజానా, లెక్కల శాఖలో ఆఫీసు సబార్డినేట్ స్థాయి నుండి రాష్ట్రస్థాయి కేడర్ అధికారుల వరకు అందరినీ ఏకతాటిపైకి తీసుకువచ్చి సంఘం సమిష్టి అభివృద్ధికి, హక్కుల సాధనకు పాటుపడే విధంగా పలు కీలకమైన నిర్ణయాలను తీసుకున్నామన్నారు. రాబోయే కాలంలో శాఖ పురోగాభివృద్ధికి, ఉద్యోగుల సమస్యలను ప్రధాన అంశాలుగా తీసుకొని పెండింగ్ లో ఉన్న ఉద్యోగోన్నతులపై ప్రత్యేక దృష్టి సారించి ,అన్ని కేటగిరీల ఉద్యోగులకు అర్హత ఉన్న మేరకు ఉద్యోగోన్నతులు కల్పించడానికి కృషి చేస్తామని స్పష్టం చేశారు. అసోసియేషన్ రాష్ట్ర సహాధ్యక్షులుగా కె శ్రీనివాసరావు, ఉపాధ్యక్షులు కరిముల్లా, కార్యనిర్వాహక కార్యదర్శిగా బి శ్రీనివాసరావు, కోశాధికారిగా యుగంధర్ తో పాటుగా 7 మంది ఉపాధ్యక్షులను, 7 మంది కార్యదర్శులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నామన్నారు. రాష్ట్ర కమిటీ ఎన్నిక కార్యక్రమంలో రాష్ట్రంలోని 26 జిల్లాల నుండి పెద్ద ఎత్తున ఖజానా, లెక్కల శాఖ ఉద్యోగులు పాల్గొన్నారు.

భద్రతతో కూడిన విద్య

- బీసీ హాస్టళ్లలో సీసీ కెమెరాల ఏర్పాటు
- తిరుపతి బీసీ కళాశాల బాలిక హాస్టల్ సందర్శన
- 26 జిల్లాల్లోనూ బీసీ భవన్లు ఏర్పాటు
- రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత

ప్రజాశక్తి -తిరుపతి టౌన్ : బీసీ హాస్టళ్ల విద్యార్థులకు భద్రతతో కూడిన విద్య అందించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని, ఇందులో భాగంగా ప్రతి హాస్టళ్లోనూ, గురుకుల పాఠశాలల్లోనూ ఇన్వెర్టర్లతో పాటు సీసీ కెమెరాలు ఏర్పాటు చేయనున్నా మని రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యుఎస్ సంక్షేమ, చేనేత, జౌళి శాఖ మంత్రి ఎస్ సవిత అన్నారు. ఆదివారం నగరంలోని బీసీ బాలిక హాస్టల్‌ను మంత్రి సందర్శించారు. హాస్టల్లో ప్రతి గదిని, బాత్ రూమ్ లను, మరుగు దొడ్లను పరిశీలిం చారు. అనంతరం తనను కలిసిన విలేకరు లతో మాట్లాడుతూ ఇటీవల ప్రవేశపెట్టిన బడ్జెట్లో వెనుకబడిన తరగతుల అభివృద్ధికి తమ ప్రభుత్వం రూ.39 వేల కోట్లకు పైగా ఎన్నడూ లేనంతగా బీసీల అభ్యున్నతికి అత్యధిక నిధులు కేటాయించామన్నారు. అందులో భాగంగా బీసీ హాస్టళ్ల మరమ్మతు లకు రూ.25 కోట్లు కేటాయించామన్నారు. నిరంతరం విద్యుత్ సదుపాయం ఉండేలా హాస్టళ్లలలో ఇన్వర్టర్లతో పాటు విద్యార్థుల భద్రతను దృష్టిలో పెట్టుకుని సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. హాస్టళ్లలో పరిశుభ్రమైన వాతావరణంతో పాటు నాణ్యమైన ఆహారం అందించడంతో పాటూ విద్యార్థులను కంటికి రెప్పలా కాపాడుతు న్నామన్నారు.



మంత్రి సవితను ఆహ్వానిస్తున్న దృశ్యం

26 జిల్లాల్లోనూ బీసీ భవనాల నిర్మాణం.. రాష్ట్ర వ్యాప్తంగా 26 జిల్లాల్లోనూ బీసీ భవనాలు నిర్మించనున్నట్లు మంత్రి సవిత తెలిపారు. 2014-19లో అప్పటి టీడీపీ ప్రభుత్వం బీసీ భవన్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేసింద న్నారు. ఆ భవనాలన్నీ 70 నుంచి 80 శాతం పూర్తయ్యాయన్నారు. తరవాత వచ్చిన జగన్ ఆ నిర్మాణాలను పట్టించుకోలేదన్నారు. అసంపూర్తిగా నిలిచిపోయిన బీసీ భవన్లతో పాటు కొత్త జిల్లాల్లోనూ నూతన భవనాలు నిర్మించ నున్నా మన్నారు. గత ప్రభుత్వం బీసీ హాస్టళ్లను కూడా గాలి కొదిలేశార న్నారు. హాస్టళ్ల మరమ్మతులకు రూపాయి కూడా నిధు లివ్వ లేదని, చివరికి విద్యార్థుల డైట్ బిల్లులు కూడా చెల్లించలేదన్నారు.గత ఐదు ఏళ్ల బీసీలను అన్ని విధాలా అన్యాయం చేసి బీసీ ద్రోహిగా జగన్ చరిత్రలో నిలిచిపోయారని మంత్రి ఆగ్రహం వ్యక్తంచేశారు.

ప్రతి ఇంటి నుంచి ఓ వ్యాపార వేత్త..

బీసీ కార్పొరేషన్ల ద్వారా స్వయం ఉపాధి పథకాలు అందించనున్నా మన్నారు. ఇందులో భాగంగా ప్రతి ఇంటి నుంచి ఒక వ్యాపారవేత్తను రూపొందించేలా ప్రణాళికలు తయారు చేశా మన్నారు. తిరుపతిలోని బీసీ బాలికలను హాస్టల్ ను మంత్రి సందర్శించారు. పొట్టి శ్రీరాముల వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ జిల్లా అధ్యక్షుడు నరసింహ యాద వ్, నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ ఛైర్మన్ రుద్రకోటి సదాశివం, బీసీ సెల్ అధ్యక్ష, కార్యదర్శులు చంద్రశేఖర్, కృష్ణ యాదవ్ పాల్గొన్నారు.

టిటిడి విద్యాసంస్థల తైక్వాండో కోచ్‌కు క్రీడారత్న అవార్డు



అవార్డు స్వీకరిస్తున్న తైక్వాండో కోచ్ మాస్టర్ గోపి నాయుడు

ప్రజాశక్తి -తిరుపతి సిటీ : టీటీడీ సీనియర్ అసిస్టెంట్ , ఆ విద్యా సంస్థల తైక్వాండో కోచ్ మాస్టర్ కొమ్మినేని గోపి నాయుడు కి అరుదైన గౌరవం లభించింది. బెంగళూరు వేదికగా ఆదివారం జెపి పార్క్ కప్- 2024 ఓపెన్ నేషనల్ తైక్వాండో ఛాంపియన్ షిప్ పోటీలు అట్టహాసంగా నిర్వహించారు. ఇందులో భాగంగా తిరుపతికి చెందిన మాస్టర్ కొమ్మినేని గోపి నాయుడు తైక్వాండో కోచ్ గా, ఉత్తమ క్రీడాకారులను తయారు చేయడంలో ఆయన కృషికి గుర్తింపుగా పోటీల ఆర్గనైజర్ పెంచలయ్య క్రీడారత్న అవార్డును ప్రదానం చేశారు. ఈ సందర్భంగా పలువురు హర్షం వ్యక్తం చేస్తూ ఆయనను అభినందించారు.

డీఎంపై విజిలెన్స్ విచారణ జరపాలి: ఎస్‌డబ్ల్యూఎఫ్

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : ఏపీఎస్ ఆర్టీసి గూడూరు డిపో కండక్టర్, డ్రైవర్ల అక్రమ సస్పెన్షన్ లను వెంటనే రద్దు చేయాలని, ఆ డిపో మేనేజర్‌పై విజిలెన్స్ విచారణ చేయించాలని ఎస్‌డబ్ల్యూఎఫ్ రాష్ట్ర గౌరవాధ్యక్షులు ఎస్‌కె జిలాని బాషా డిమాండు చేశారు. గూడూరు డిపో ఎదుట ఎస్‌డబ్ల్యూఎఫ్ చేపట్టిన రిలే నిరాహార దీక్షలు శనివారం 4వ రోజుకు చేరుకుంది. ఈ రిలే దీక్షల్లో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ గూడూరు డిపో మేనేజర్‌పై తక్షణం విజిలెన్స్ అధికారులచే విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. డిఎం వైఖరి మార్చుకోవాలని అక్రమ సస్పెన్షన్‌లను రద్దుచేసి ఉద్యోగులను విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు, ఈ డిపో మేనేజరు వైఖరి చాలా విచిత్రంగా ఉందని, 1/2019 సర్క్యులర్ ను అందరికీ సమానంగా అమలు చేయాలని ఏకపక్షంగా నిర్ణయాలు మంచి పద్ధతి కాదని, ఈ డిపోలో బతిమిలాడి కేసులు తీసుకుంటున్నారని, మరి కొంతమంది ఆర్థిక నేరాలకు పాల్పడి కేసులు తీసుకుంటున్నారని తమకు సమాచారాలు వస్తున్నాయన్నారు. దీనిపై విజిలెన్స్ అధికారులు తక్షణం ఎంక్వయిరీ జరపాలని, డిపో మేనేజర్‌పై కూడా విజిలెన్స్ అధికారులు విచారణ చేపట్టాలని ఆయన కోరారు. ఎస్‌డబ్ల్యూఎఫ్ జిల్లా అధ్యక్షులు డి మల్లికార్జున మాట్లాడుతూ డిపో మేనేజరు తమకేమి సంబంధం లేదని, పై అధికారులు ఎలా చెపితే అలా చేస్తున్నా పై అధికారులు మాత్రం అది మీ డిపో పరిధిలో విషయమని, తమ దృష్టికి రాలేదని ఒకరిపై మరొకరు చెప్పుకుంటున్నారన్నారు. అసలు ఈ డిపోలో ఏమి జరుగుతోందో స్పష్టత సభ్యులకి, ప్రజలందరికీ తెలియాల్సి వుందన్నారు. దీనిపై వెంటనే స్పందించి కమిటీ వేసి విచారణ జరిపించాలని, సస్పెండ్‌కు గురైన ఉద్యోగులను వెంటనే విధులను తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం డిపో కమిటీ ఉపాధ్యక్షులు ఎన్ వెంకటేశ్వర్లు, ఎం శేషయ్య, ఎన్.శ్రీనివాసులు, డి శ్రీధర్, పి కిరణ్, జివి రమణయ్య, కె సుబ్రహ్మణ్యం, ప్రాంతీయ ట్రేడ్ యూనియన్ నాయకులు జోగి శివకుమార్, సిఐటియు జిల్లా కమిటీ సభ్యులకు పి శ్రీనివాసులు, పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు బివిరమణయ్య, ఎస్ సురేష్, నాయకులు ఆర్ శ్రీనివాసులు, గుర్రం రమణయ్య, ముత్యాలయ్య, గండికోట మధు, అడపాల ప్రసాద్ పాల్గొన్నారు.


రిలే దీక్షకు మద్దతు తెలిపిన ఎస్‌డబ్ల్యూఎఫ్ రాష్ట్ర గౌరవాధ్యక్షులు జిలాని బాషా

ఘనంగా పొట్టి శ్రీరాములు వర్థంతి

ప్రజాశక్తి -రామచంద్రపురం (చంద్రగిరి): భాషా ప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటుకు ప్రాణాలర్పించిన అమరజీవి, ఆంధ్ర జాతిపిత పొట్టి శ్రీరాములు వర్థంతిని మండలంలోని కళ్యాణి డాం వద్ద పోలీస్ ట్రైనింగ్ కాలేజీలో ఘనంగా నిర్వహించారు. పోలీస్ ట్రైనింగ్ కళాశాల సమావేశ మందిరంలో పొట్టి శ్రీరాములు చిత్ర పటానికి ప్రిన్సిపల్ సుబ్రహ్మణ్యం రెడ్డి, సిబ్బంది పూల మాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అవతరణకు కారణ భూతుడు పొట్టి శ్రీరాములేనని, ఆయన సేవలను, త్యాగాలను గుర్తు చేశారు. ప్రేమ, వినయం, నిస్వార్థతలు మూర్తి భవించిన స్వరూపమే పొట్టి శ్రీరాములు అని కొనియాడారు. అందరూ పొట్టి శ్రీరాముల అడుగుజాడల్లో నడుస్తూ ఉత్తమ సేవలు అందిద్దామని పిలుపునిచ్చారు.

అష్టలక్ష్మీ ఉత్సవాల్లో కేంద్ర మంత్రి


అష్టలక్ష్మీ ఉత్సవాల్లో పాల్గొన్న కేంద్ర మంత్రి గిరిరాజ్‌సింగ్

ప్రజాశక్తి -రామచంద్రాపురం: మండలంలోని సి రామాపురం సిద్దేశ్వర తీర్థం (బ్రహ్మర్షి గురుజీ ఆశ్రమం) లో నిర్వహిస్తున్న అష్టలక్ష్మి ఉత్సవాలలో కేంద్ర చేనేత శాఖామంత్రి గిరిరాజ్ సింగ్ పాల్గొన్నారు. ఆదివారం ఆశ్రమానికి చేరుకున్న కేంద్రమంత్రి గిరిరాజ్ సింగ్ కు ఆశ్రమ నిర్వాహకులు, రెవెన్యూ సిబ్బంది పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం ప్రార్థన మందిరంలో నిర్వహిస్తున్న అష్టలక్ష్మి ఉత్సవాలలో ఆయన పాల్గొని అర్చకుల వేదమంత్రాలు, మంగళ వాయిద్యాలు, నడుమ ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆశ్రమ పీఠాధిపతి బ్రహ్మర్షి గురువానంద గురూజీ ని కేంద్ర మంత్రి గిరిరాజ్ సింగ్, టిటిడి పాలక మండలి సభ్యులు భాను ప్రకాష్ రెడ్డి, పీసీ రాయలు కుటీరంలో కలిసి ఆశీర్వాదం పొందారు. ఆశ్రమ నిర్వాహకులు అన్న ప్రసాదాలు అందించారు.

కూరగాయలు, గుడ్లు పంపిణీ

ప్రజాశక్తి - గూడూరు టౌన్: గూడూరు జెవిఆర్ ఆధ్వర్యంలో సూర్యా ఫ్యాన్సీ అధినేత ఒగ్గు వేణుగోపాల్ దాతృత్వంలో స్థానిక సిఐసి పాఠ్యంలో ప్రత్యేక ప్రతిభావంతులకు ఆదివారం కూరగాయలు, గుడ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జెవిఆర్ స్థానిక అధ్యక్షులు వేగూరు రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ జనవిజ్ఞాన వేదిక మూఢనమ్మకాలకు వ్యతిరేకంగా పనిచేయడమే కాకుండా అనేక సేవా కార్యక్రమాలు చేస్తోందని, గత 32 సంవత్సరాలుగా ప్రజల్లో మూఢ నమ్మకాలపై అవగాహన కల్పిస్తున్నామని విద్యార్థులను శాస్త్రీయ దృక్పథం వైపు పయనించేలా చెకుముకి పరీక్షలు నిర్వహిస్తూ వారిని చైతన్య పరుస్తున్నామని తెలిపారు. ప్రతి నెల 9వ తేదీ గర్భిణులకు భోజనాలు, ప్రతినెల మూడవ ఆదివారం కూరగాయలు, గుడ్లు పంపిణీ చేస్తున్నామని తెలిపారు. అన్ని కాలేజీలలో మూఢనమ్మకాలపై అవగాహన కలిగేలా విద్యార్థులకు పరీక్షలు నిర్వహిస్తూ వారికి బహుమతులు, బహుమతులు అందిస్తున్నామన్నారు. ఇందుకు అందరి సహకారం అవసరమని కోరారు. ఈ కార్యక్రమంలో రాజేంద్రప్రసాద్, నాగరాజు, చెంచునారాయణ, గుర్రం విజయ్ బాబు, ఇబ్రహీం, మామడూరు రాధయ్య, ప్రభాకర్, సుమన్ రెడ్డి, ఆనంద్, శ్రీనివాసాచారి, వెంకటేశ్వర్లు, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

తాగునీటి సంఘం అధ్యక్షులకు సన్మానం


మాట్లాడుతున్న ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం

ప్రజాశక్తి - నాగలాపురం : నాగలాపురం మండలం సాగునీటి సంఘాల ఎన్నిక ప్రశాంతంగా ముగిసాయి. ఈ ఎన్నికల్లో మండలంలోని 14 చెరువుల సంఘాలు ఏకగ్రీవ మయ్యాయి. ఎన్నికైన వారు ఆదివారం స్థానిక టీడీపీ కళ్యాణ మండపంలో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాయకులు ఐక్యమత్యంతో అన్ని నీటి సంఘాలను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం పట్ల అభినందనలు తెలిపారు. ఇదే స్ఫూర్తితో భవిష్యత్తులో కార్యక్రమాలను విజయవంతం చేయాలని ఆయన కోరారు. అనంతరం ఎన్నికైన వారందరికీ పూలమాలలు దుశ్శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో సెల్వ కుమార్, కుమార్ వేల్ రెడ్డి, ప్రసాద్ రాజు, శ్రీనివాస యాదవ్, డాక్టర్ ఎడి శేషాద్రి, ఎస్ ఎస్ సురేష్, గురాల్ బాషా, గోకుల్ నాయుడు, రాజశేఖర్ యాదవ్,వెంకటేశులు, మహేష్, పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

రామచంద్రాపురం : రాయలచెరువు సాగునీటి సంఘం అధ్యక్షుడు కొడవ కంటి అర్జున్ నాయుడు, ఉపాధ్యక్షుడు త్యాగరాజులను రాయలచెరువు నీటి సంఘం మాజీ అధ్యక్షుడు చేకూరి ఆనంద నాయుడు ఘనంగా సన్మానించారు. ఆదివారం మిట్టూరు గ్రామంలోని కమ్యూనిటీ హాల్ వద్ద స్థానిక టిడిపి నాయకులతో కలిసి దుశ్శాలువా, పూలమాలలతో ఘనంగా సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా చేకూరి ఆనంద నాయుడు మాట్లాడుతూ రాయల చెరువు అభివృద్ధికి నూతన కమిటీ సభ్యులు కృషి చేయాలని, నీటి సంరక్షణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని కోరారు. రాయల చెరువు అభివృద్ధికి కట్టుబడి పని చేస్తామని, రైతుల సాగు నీటి సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని నూతన అధ్యక్షులు అర్జున్ నాయుడు, ఉపాధ్యక్షుడు త్యాగరాజులు రైతులకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకులు సి జనార్దన్ చౌదరి, వెంకట ప్రసాద్, భూపాల్ నాయుడు, రేణు చౌదరి, గరుడాద్రి నాయుడు, కే ధనంజయులు, వెంకటయ్య యాదవ్ పాల్గొన్నారు.


అర్జున్‌నాయుడు, త్యాగరాజులను సన్మానిస్తున్న దృశ్యం

పుత్తూరు టౌన్ : రూరల్ మండలం పరిధిలోని గూళూరు చెరువు ఆయకట్టు ఛైర్మన్‌గా ఏకగ్రీవంగా ఎన్నికైన ఎస్ వెంకట్రాయులును నూతన ఎన్నికైన ఆయకట్టు సంఘ సభ్యులు, పద్మశాలి రాష్ట్ర కార్పొరేషన్ డైరెక్టర్ గంజి మాధవయ్య మర్యాద పూర్వకంగా కలిశారు. ఆయన ఆయకట్టు ఛైర్మన్ గా ఎస్.వెంకట్రాయులు, వైస్ ఛైర్మన్ గా కె కృష్ణయ్య, సభ్యులుగా ఎన్నికైన గురవయ్య, సుబ్రహ్మణ్యం, భూపతి, మని రామయ్యలను ఆయన ఆదివారం ఘనంగా శాలువా కప్పి, పూలమాలవేసి సన్మానించి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో తడుకు సర్పంచ్ బొట్టిలి యాదవ్, పుత్తూరు రూరల్ మండల మాజీ అధ్యక్షుడు కరుణా యాదవ్, టీడీపీ సీనియర్ నాయకులు భాస్కర్ శెట్టి పాల్గొన్నారు.


ఎస్ వెంకట్రాయులును సన్మానిస్తున్న గంజి మాధవయ్య

ప్రజాశక్తి -రామచంద్రపురం (చంద్రగిరి) మండలంలోని ఎ.రంగంపేట గ్రామానికి చెందిన నాగపట్ల చెరువు నీటి సంఘం అధ్యక్షుడు ఎం. వెంకట సుబ్బయ్యను ఆదివారం మధ్యాహ్నం చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని సన్మానించారు. అధ్యక్షుడిగా ఎన్నికైన సందర్భంగా పులివర్తి నానికి కృతజ్ఞతలు తెలపడానికి గ్రామంలోని నాయకులతో కలిసి పులివర్తి నానిని కలిశారు. ఈ క్రమంలో నూతనంగా ఎన్నికైన అధ్యక్షునికి అభినందనలు తెలిపి శాలువాతో సత్కరించారు. గ్రామంలోని ఆయకట్టుదారులందరినీ పార్టీలకతీతంగా అభివృద్ధికి ముందుకు రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎ. రంగంపేట క్లస్టర్ ఇంచార్జ్ ఎం.జ్ఞాన శేఖర్, పార్టీ సీనియర్ నాయకులు దేవిలాల్, ముని భీమారావు, ఎం.నరేంద్ర, వేణు రాయల్, వాసు, వేణుగోపాల్ రెడ్డి, పలని పాల్గొన్నారు.


వెంకటసుబ్బయ్యను సన్మానిస్తున్న ఎమ్మెల్యే నాని

పోలేరమ్మ ఆర్చి పనులు ప్రారంభం

ప్రజాశక్తి-వెంకటగిరి: వెంకటగిరి పట్టణ పరిధిలోని క్రాస్‌రోడ్డు వద్ద పోలేరమ్మ ఆర్చి పనులను స్థానిక ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ ఆదివారం ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈఆర్చి పనులు చేయాలని గత 15సంవత్సరాల నుండి ప్రయత్నాలు సాగించినట్లు తెలిపారు. నేటి కి అది నెరవేరిందన్నారు. దాదాపు రూ.56 లక్షలతో ఈపనులు పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. ఈ ఆర్చితో వెంకటగిరి పట్టణానికి శోభాయమానంగా కనబడుతుందన్నారు. ఆర్చి వద్ద అమ్మవారి చిన్నపాటి గుడి కనుమాసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీ సుబ్బరాయులు, శ్రీరామదాసు, టిడిపి నాయకులు దుగ్గిరాజారావు, బీరం రాజేశ్వరరావు, మంకు ఆనంద్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మినరల్ ఆర్‌ఓ ప్లాంట్ ప్రారంభం

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : వడమాల పేట మండలం టిపి అగ్రహారంలో ఐదు లక్షల వ్యయంతో ఏర్పాటు చేసిన మినరల్ ఆర్వో ప్లాంటును నగరి ఎమ్మెల్యే గాలి భాను ప్రకాష్ ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల ఆరోగ్యాలు గా ఉండాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం మినరల్ వాటర్ ప్లాంట్ ను ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో వుంచుకుని పలుచోట్ల ఇలాంటి వాటర్ ప్లాంట్‌లను ప్రారంభిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ అధ్యక్షులు జాన వెంకటయ్య, జిల్లా మహిళా నాయకురాలు లక్ష్మి ప్రసన్న, ధనుంజయ నాయుడు, హైమావతి, అధికారులు పాల్గొన్నారు.


ఆర్‌వో ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే భానుప్రకాష్

రోడ్డు పక్కే పేడ దిబ్బలు

- ముక్కు మూసుకుని రాకపోకలు
- అపరిశుభ్రతతో వ్యాధులు వ్యాపించే ప్రమాదం
- భయాందోళనలో ప్రజలు

ప్రజాశక్తి -కోట : కోట మండలం చిట్టేడు పంచాయతీలో వజ్జవారిపాలెం కు వెళ్లే రోడ్డు పైనే అక్కడక్కడా పేడ దిబ్బలను ఏర్పాటు చేశారు. అయితే ఆ పేడ దిబ్బలు వల్ల రోజూ విద్యార్థులు పాఠశాలకు ఉదయం, సాయంత్రం అదే రోడ్డు పై వెళుతూ వస్తుంటారు. విద్యార్థులు, స్థానికులు వాటి నుండి వచ్చే వాసన, దోమలు బారిన పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పక్కనే బాలికల వసతి గృహం ఉంది. అంతే కాకుండా పలు చోట్ల రహదారుల్లోనే పేడ దిబ్బలు వేయడంతో పలువురు నానారకాల ఇబ్బందులకు గురవుతున్నారు. జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల ప్రహరీ గోడ పక్కనే పేడ దిబ్బలు అధికంగా వేయడంతో విద్యార్థులు కిటికీల నుండి వచ్చే దుర్వాసనతో భరించలేక పోతున్నారు. అంతే కాకుండా మండలంలోని పలు పంచాయతీల్లో పాలకులు పారిశుధ్యంపై ఆసక్తి చూపకపోవడంతో ఎక్కడపడితే అక్కడ చెత్త చెదారం నిండింది. ప్రస్తుతం వర్షాకాలంలో ఎక్కువగా ప్రజలకు విష జ్వరాలు వచ్చే అవకాశాలు ఉన్నాయి. స్పందించి జాగ్రత్తగా కోట మండల అభివృద్ధి అధికారి పంచాయతీలపై శ్రద్ధ తీసుకుని చెత్త చెదారం లేకుండా జాగ్రత్తలు తీసుకునేలా ఏర్పాటు చేయాలని మండల ప్రజలు కోరుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు చిట్టేడు పంచాయతీలో రోడ్ల పక్కనే ఉన్న పేడ దిబ్బలను తొలగించేలా చర్యలు తీసుకోవాలని చిట్టెడు స్థానిక ప్రజలు కోరుతున్నారు.


రోడ్డు పక్కనే వేసిన పేడదిబ్బలు

వృత్తి దారులకు బ్యాంక్ సబ్సిడీ రుణాలు ఇవ్వాలి

ఏపీ గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు డి ప్రభాకర్

ప్రజాశక్తి- రేణిగుంట: వృత్తిదారులకు బ్యాంకు సబ్సిడీ రుణాలివ్వాలని ఏపీ గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు డి ప్రభాకర్ పేర్కొన్నారు. ఏకలవ్య ఎరుకుల సంక్షేమ సంఘం రేణిగుంట – తిరుపతి మండలాల కార్యకర్తలతో జనరల్ బాడీ సమావేశం కె ఈశ్వరమ్మ అధ్యక్షతన రేణిగుంటలో ఆదివారం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా ఏపీ గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు దినారి ప్రభాకర్ హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ గిరిజన తెగలో ఏరుకుల కులస్తులైన చేతి వృత్తి బుట్టల అల్లకం, బాతులు పెంపకం, ఉప్పు, పప్పు దినుసులు వ్యాపారం, సోది చెప్పడం వంటి వృత్తులు అంతరించిపోతున్నాయని ప్రభుత్వం ఈ వృత్తిదారులకు బ్యాంకు లో సబ్సిడీ నిధులు ఇచ్చి ఆర్థికంగా ఎదుగుదలకు ప్రోత్సహించాలని డిమాండ్ చేశారు. తిరుపతి జిల్లాలో ఎరుకల కులస్తులు కాని వారు అనేకమంది సర్టిఫికెట్లు పొంది ఎరుకల కులస్తులుగా చలామణి అవుతున్నారని వారందరినీ ప్రతి మండల కేంద్రంలో వీఆర్వో, ఆర్ ఐ, తహశీల్దారు సమగ్రంగా విచారించి కుల ధ్రువీకరణ సర్టిఫికెట్లు ఇవ్వాలని పొరపాటుగా ఎరుకులేతరులకు ఎరుకుల కులం సర్టిఫికెట్లు ఇస్తే మాత్రం ఏకలవ్య ఎరుకుల సంక్షేమ సంఘం, ఏపీ గిరిజన సంఘం కలిసి పెద్ద ఎత్తున పోరాటానికి దిగుతుందని అధికారులను ఈ సందర్భంగా హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏపీ గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు దినారి ప్రభాకర్, గిరిజన సంఘం తిరుపతి జిల్లా ప్రధాన కార్యదర్శి కె. హరినాథ్, ఏకలవ్య ఎరుకల సంక్షేమ సంఘం నాయకులు ఈశ్వరమ్మ, చీరాలయ్య, మునిస్వామి, వెంకటరమణ, యశ్వంత్, రాధిక, ప్రభాకర్, రామాంజనేయులు, ఆనంద్ బాబుపాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఏపీ గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు డి ప్రభాకర్

న్యాయపోరాటం: సిఐటియు

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి : రాష్ట్ర హైకోర్టు ఆదేశాలను అమలు చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న తొట్టంబేడు వెలుగు శాఖ అధికారులపై న్యాయ పోరాటం చేస్తామని సీఐటీయూ జిల్లా కార్యదర్శి పెనగడం గురవయ్య ఆదివారం ఒక ప్రకటనలో స్పష్టం చేశారు. తొట్టంబేడు మండలంలోని పొయ్య సంఘమిత్ర మహాలక్ష్మి, లింగమ నాయుడుపల్లి సంఘమిత్ర భూలక్ష్మి, తాటిపర్తి సంఘమిత్ర రేవతి, కొణతనేరి-2 సంఘమిత్ర సరస్వతి, కాసరం సంఘమిత్ర మాధవిలపై రాజకీయ ఒత్తిళ్ళు ఎక్కువ కావడంతో వెలుగు అధికారులు వారిని ఉద్దేశపూర్వకంగా పక్కనపెట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనిపై బాధిత సంఘమిత్రలు హైకోర్టును ఆశ్రయించగా వారికి అనుకూలంగా న్యాయస్థానం తీర్పునిచ్చిందని గుర్తు చేశారు. వారిని యధావిధిగా విధుల్లో కొనసాగించమని చెబుతూ, పెండింగ్ వేతనాలు చెల్లించాలని కూడా అధికారులను ఆదేశించిందన్నారు. ఈ నేపథ్యంలో హైకోర్టు ఆదేశాలను అమలు చేయాలని వెలుగు శాఖ పిడి శోభన్ బాబును బాధిత సంఘమిత్రలు కలవగా ఆయన వెంటనే వారిని విధుల్లోకి తీసుకోవాలని తొట్టంబేడు ఏపీఎంకు ఆదేశాలు జారీ చేశారని అన్నారు. ఆ మేరకు ఏపీఎంను బాధిత సంఘమిత్రలు కలిసినా విధుల్లోకి తీసుకోకుండా జాప్యం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు ఎప్పటికైనా హైకోర్టు ఆదేశాలను అమలు చేయకుంటే కోర్టు ధిక్కారం కింద న్యాయ పోరాటం చేస్తామని హెచ్చరించారు.

ఘనంగా ఫ్రెషర్స్ డే

ప్రజాశక్తి- తిరుపతి సిటీ : బాలాజీ నర్సింగ్ కాలేజీ, వినాయక నర్సింగ్ స్కూల్, ప్రవీణ్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ పారామెడికల్ సైన్స్ సంయుక్తంగా ఫ్రెషర్స్ డే ను ఆదివారం ఘనంగా నిర్వహించారు. స్థానిక బైరాగిపట్టెడలోని గంధమనేని శివయ్య భవన్‌లో జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రముఖ సినీహీరో, డైరెక్టర్, వ్యక్తిత్వ వికాస ట్రైనర్ ప్రదీప్ కొండిపర్తి, ప్రత్యేక ఆహ్వానితులుగా ఎస్.రవీంద్రా రెడ్డి, గౌరవ కార్యదర్శి ఎం ఈ ఎస్ బిల్డర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా, కె శంకరయ్య క్లాస్ వన్ కాంట్రాక్టర్, ఎం.గిరిజా మోహన్ ,సోషల్ యాక్టివిస్ట్ విచ్చేశారు. ప్రదీప్ మాట్లాడుతూ వ్యక్తిత్వ వికాసం పై విద్యార్థి విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ. ప్రతి విద్యార్థి ఒక లక్ష్యాన్ని నిర్ణయించుకోవాలని, వారి ఫోకస్ అంతా ఆ లక్ష్యం పైనే ఉండాలని అప్పుడే వారు లక్ష్యాన్ని సాధించగలరని అన్నారు. ఆ లక్ష్యాన్ని ఎలా సాధించాలో ప్రజెంటేషన్ ని ఇచ్చారు. ప్రత్యేక ఆహ్వానితులు రవీంద్రారెడ్డి మాట్లాడుతూ స్నేహం చిరకాలం ఉండాలంటే మనతోపాటు ఎదుటి వారికి కూడా క్వాలిటీ ఉన్నప్పుడే చిరకాలం నిలుస్తుందని ,ఈ వేదిక పైన ఉన్న మిత్రులు ఎలమంచిలి ప్రవీణ్, శంకరయ్య, గిరిజ, మోహన్ దాదాపు 50 సంవత్సరాల నుంచి స్నేహాన్ని కొనసాగిస్తున్నామని, ఈ వేదిక స్నేహానికి ఒక గోల్డెన్ జూబ్లీ సెలబ్రేషన్ అని తెలిపారు. దీన్ని విద్యార్థి విద్యార్థినిలు ఒక రోల్ మోడల్ గా తీసుకొని వారి జీవితాంతం స్నేహితులతో సత్సంబంధాలు కొనసాగించాలని పిలుపు నిచ్చారు. శంకరయ్య మాట్లాడుతూ మనం స్నేహితునికి ఎంత దూరంలో ఉన్నావో అనేది ముఖ్యం కాదు.. మనసులు ఎంత దగ్గరగా ఉన్నాయనేది ముఖ్యమని, అందువల్లే ఈ 50 సంవత్సరాలుగా స్నేహాన్ని కలిసి కొనసాగించామన్నారు. గిరిజా మోహన్ మాట్లాడుతూ స్నేహానికి ఆడ మగ తేడాలు ఉండవని నిజమైన మిత్రులు ఎల్లవేళలా కష్టాలలోనూ, సంతోషంలోనూ వెన్నంటే ఉంటారని అన్నారు. ఈ కార్యక్రమంలో ఛైర్మన్ ఎలమంచిలి ప్రవీణ్, కరస్పాండెంట్ ఏలియమ్మ జాన్, ప్రిన్సిపల్స్ జెస్సి గ్రేస్, నవీన్ కుమార్, ఏ.గీత, డియర్ పింకీ, భార్గవి మోహన్ కృష్ణ, సునీల్ రెడ్డి, అఖిల్, హారిక పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రముఖులు

చంద్రగిరి అభివృద్ధికి కృషి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి -రామచంద్రపురం (చంద్రగిరి): చంద్రగిరి నియోజకవర్గ అభివృద్ధికి అన్ని విధాల కృషి చేద్దామని ఎమ్మెల్యే పులివర్తి నాని అన్నారు. చంద్రగిరి పట్టణంలో రూ. రెండు కోట్ల రూపాయలతో నూతన మండల పరిషత్ కార్యాలయ నిర్మాణానికి ఆదివారం ఎమ్మెల్యే నాని శంకుస్థాపన చేసి భూమి పూజ నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొనటానికి విచ్చేసిన ఎమ్మెల్యేకు అధికారులు,కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలు పూర్ణ కుంభంతో స్వాగతం పలికారు.మంగళ వాయిద్యాలు నడుమ భూమి పూజ చేసే స్థలానికి వచ్చారు. శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో ఎమ్మెల్యే పులివర్తి నాని మాట్లాడుతూ ఎన్నో సంవత్సరాలుగా మండల పరిషత్ కార్యాలయం నిర్మాణానికి నోచుకోక పోవడంతో,ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు భవన నిర్మాణానికి సుమారు 2కోట్ల రూపాయలను మంజూరు చేయించామని దాని ప్రకారం నూతన ఎంపిడిఓ కార్యాలయానికి శంకుస్థాపన చేసినట్లు తెలిపారు. చంద్రగిరి నియోజకవర్గ అభివృద్దే ధ్యేయంగా అందరి సహకారం తో ముందుకు సాగుతున్నట్లు చెప్పారు. వైసీపీ వారు అనాలోచిత పాలనతో ప్రభుత్వ వ్యవస్థలను నిర్వీర్యం చేశారని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ హేమేంద్ర కుమార్ రెడ్డి, జెడ్‌పిటిసి చిలకూరు యుగంధర్ రెడ్డి, సర్పంచ్ రూపారామ్మూర్తి, టిడిపి నాయకులు గౌస్ బాషా, రమేష్ రెడ్డి, ఏజిపల్లి బాల, ఎం సి ఆర్,సక్కూరు ధనుంజయ రెడ్డి, గ్యాస్ నాగరాజ్,తాపసి మురళి కృష్ణారెడ్డి, వినోద్, అనిల్, ఎంపీడీవో శేఖర్ పాల్గొన్నారు.



ఎంపిడివో కార్యాలయ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే

ఆహార పదార్థాలు వితరణ

ప్రజాశక్తి -సత్యవేడు: తుపాను బాధితులకు సహాయంగా గ్రేప్స్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో వరద బాధితులైన సత్యవేడు మండల కొత్తమారికుప్పం గిరిజనులకు ఆహార పదార్థాలను ఆదివారం అందించారు. గ్రేప్స్(కృతి సోషల్ ఇన్నోవేటివ్స్) స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో పెన్గల్ తుఫాను ఈ కార్యక్రమంలో ప్రవీణ్ రాజ్ కుమార్, రేష్మ మాట్లాడుతూ గ్రేప్స్ ఆర్గనైజేషన్ వెనుకబడిన వారికి సాయం చేసి ఆదుకుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో గ్రేప్స్ స్వచ్ఛంద సంస్థ వాలంటరీలు, కాలనీవాసులు పాల్గొన్నారు.

మంత్రి లోకేష్‌తో వినుత భేటీ

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: రాష్ట్ర మంత్రి, టీడీపీ జాతీయ కార్యదర్శి నారా లోకేష్ బాబును జనసేన శ్రీకాళహస్తి నియోజకవర్గ ఇన్‌చార్జి కోటా వినుత దంపతులు ఆదివారం విజయవాడలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా శ్రీకాళహస్తి ప్రాంత తాజా రాజకీయ పరిస్థి తులపై చర్చించారు. కూటమి సమన్వయంపై చర్చించారు. నామినేటే పదవుల్లో జనసేన కు ప్రాధాన్యత నివ్వాలని కోరారు.


లోకేష్‌ను కలిసిన జనసేన నాయకులు

అలుపెరగని ఉపాధ్యాయుడు

ప్రజాశక్తి -నారాయణవనం: నారాయణవనం మండలం పాలమంగళం ఉన్నత పాఠశాల సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుడు ఏ గోపి విద్యార్థుల భవిష్యత్తు ఉజ్వల భవిష్యత్తే తన పరమావధిగా భావించి ఎంతో కృషి చేస్తున్నారు. తుపాన్ కారణంగా వరసగా 4 రోజుల సెలవులు రావడం, అరుణానదిలో ఉధృతంగా వరద నీరు ప్రవహిస్తుండటంతో తుంబూరు అరుణానది కాజ్‌వేలో ఎక్కువ నీరు ప్రవహిస్తుండటంతో గ్రామానికి రాకపోకలు అంతరాయం ఏర్పడిన నేపథ్యంలో ఎస్ఏఐ పరీక్షలు జరుగుతున్న కారణంగా అతి కష్టంపై వాగులను దాటలేని పిల్లలు ఇంటి వద్దే వారిని చదివిస్తూ వారిని పర్యవేక్షించారు. గ్రామ ప్రజలు ఉపాధ్యాయుడు గోపి ని అభినందించారు.


విద్యార్థులను చదివిస్తున్న ఉపాధ్యాయుడు గోపి

ఎడ్యుకేషన్ ఫెయిర్‌కు విశేష స్పందన

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): ఫౌండేషన్ ఫర్ యూత్ అడ్వాన్స్మెంట్ ఆధ్వర్యంలో తిరుపతి నగర పరిధిలోని రాజ్ పార్క్ హోటల్లో ఆదివారం నిర్వహించిన ఎడ్యుకేషన్ ఫెయిర్ కు విశేష స్పందన వచ్చిందని ఫౌండేషన్ ఉపాధ్యక్షులు తూ పల్లి నందకిషోర్ తెలిపారు. ఎడ్యుకేషన్ ఫెయిర్ ప్రారంభానికి ఏఐఎస్ఎఫ్, టిఎన్ఎస్ఎఫ్ విద్యార్థి సంఘాల నాయకులు హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారన్నారు. దాదాపు 20 కి పైగా విశ్వవిద్యాలయాల నుండి వచ్చిన ప్రతినిధులతో 300 మంది విద్యార్థులు వారికున్న సందేహాలపై మాట్లాడారు. సోమవారం సాయంత్రం వరకు ఈ ఎడ్యుకేషన్ ఫెయిర్ కొనసాగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో అపోలో, గీతం, జైన్, వినాయక మిషన్, ఎస్ఆర్ఎం, సెంచూరియన్, దయానంద సాగర్ తదితర విశ్వవిద్యాలయాలకు చెందిన వారు, ఫౌండేషన్ ఆర్గనైజింగ్ సెక్రటరీ వాసుదేవ రెడ్డి పాల్గొన్నారు.



రాష్ట్ర పంచాయతీరాజ్ డిప్లమో ఇంజనీర్ల సంఘ గౌరవాధ్యక్షుడిగా షేక్ రియాజ్ అహ్మద్

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : తిరుపతిలోని ఎస్సార్ కన్వెన్షన్ హాలులో నిర్వహించిన రాష్ట్ర పంచాయతీరాజ్ డిప్లమో ఇంజనీర్ల సంఘ సర్వసభ్య సమావేశంలో ఆ సంఘ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడిగా షేక్ రియాజ్ అహ్మద్ తిరిగి ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రాష్ట్ర అధ్యక్షుడిగా కర్నూలుకు చెందిన కె రవీంద్ర, ప్రధాన కార్యదర్శిగా శ్రీకాకుళంకు చెందిన మహంతి, ట్రెజరర్ గా విజయవాడకు చెందిన వెంకటరెడ్డి ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ అశోక్ బాబు మాట్లాడుతూ రియాజ్ అహ్మద్ ఉమ్మడి తెలుగు రాష్ట్రంలో పంచాయతీరాజ్ డిప్లమో ఇంజనీర్ల సంఘ అధ్యక్షుడుగా ఉన్నప్పటి నుండి రాష్ట్ర ఉద్యోగ సంఘం జేఏసీలో వైస్ ఛైర్మన్‌గా పాలుపంచుకున్నారని తెలిపారు. అప్పటినుండి సంఘానికి రాష్ట్ర ఉద్యోగ సంఘ జేఏసీ అండగా ఉంటుందని ఇకపై కూడా డిమాండ్స్ సాధనకు పాటుపడతామని తెలిపారు. అనంతరం పలువురు నూతన కార్యవర్గానికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉద్యోగ సంఘాల జేఏసీ ఛైర్మన్, ఎమ్మెల్సీ పరుచూరి అశోక్ బాబు, యోగ సంఘాల జేఏసీ ఛైర్మన్ శివారెడ్డి, జనరల్ సెక్రెటరీ పురుషోత్తమ నాయుడు , వెస్ట్ కృష్ణ, ఎన్జీవో అధ్యక్షులు విద్యాసాగర్ పాల్గొన్నారు.


నూతన కార్యవర్గ సభ్యులను అభినందిస్తున్న దృశ్యం

క్రైం న్యూస్

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

ప్రజాశక్తి -తిరుపతి సిటీ : రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి చెందిన ఘటన ఆదివారం నగరంలో చోటు చేసుకుంది. ఎంఆర్ పల్లి పోలీసుల కథనం మేరకు తిరుపతి రూరల్ మండలం వకుళమాత ఆలయ సమీపంలో పేరూరు వద్ద జాతీయ రహదారిపై, ఆదివారం స్కూటర్ ను కారు ఢీకొన్న ప్రమాదంలో నగరికి చెందిన గోవిందమ్మ అక్కడికక్కడే మరణించారు. గోవిందమ్మ ఆమె భర్త నగిరి నుంచి చంద్రగిరి మండలం పిచ్చినాయుడు పల్లి లో ఓ శుభకార్యానికి హాజరయ్యేందుకు ద్విచక్ర వాహనం మీద వస్తున్నారు. తిరుపతి రూరల్ మండలం పేరూరు ఒకళమాత ఆలయ వద్ద జాతీయ రహదారి సర్కిల్ దగ్గర వేగంగా ఓ కారు ఢీకొనడంతో గోవిందమ్మ కు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందింది. ఇదే ప్రమాదంలో మరో ఇద్దరికి గాయాలయ్యాయి. విషయ తెలుసుకున్న తిరుపతి రూరల్ పోలీస్ లు. సంఘటన స్థలానికి చేరుకుని ఘటన స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తిరుపతి ఎస్వీ మెడికల్ కళాశాలకు తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): తిరుపతి-కరకంబాడి మార్గంలోని రెడ్డి భవన్ వద్ద ఆదివారం రెండు బైకులు ఢీకొన్న సంఘటనలో ముగ్గురు యువకులకు తీవ్ర గాయాలు అయ్యాయి. స్థానికంగా ఉన్న సమాచారం ప్రకారం కరకంబాడి రాజీవ్ గాంధీ కాలనీకి చెందిన యశ్వంత్, సాయి అనే యువకులు తిరుపతి నుండి కరకంబాడి వైపు వస్తుండగా రెడ్డి భవన్ వద్ద ఎదురుగా పచ్చికాపలం బుట్టి రెడ్డి కండ్రిగ గ్రామానికి చెందిన దేవన్ రోడ్డు క్రాస్ చేస్తుండగా వేగంగా వచ్చిన యశ్వంత్ ద్విచక్ర వాహనం ఢీకొనడంతో ప్రమాదం చోటుచేసుకుంది. వేగంగా ఢీకొన్న నేపథ్యంలో దేవన్ ఎడమ కాలు విరిగిపోయి తలకు తీవ్ర గాయం అయింది. యశ్వంత్‌కు కూడా తల ఎడమపై భాగంలో పెద్ద గాయం ఏర్పడింది. గాయపడిన వారికి తీవ్ర రక్తస్రావం అవుతుండడంతో స్థానికులు 108కి సమాచారం ఇచ్చారు. ఎంతసేపటికి 108 రాకపోవడంతో ప్రైవేట్ అంబులెన్సులో చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. అలిపిరి పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వడ్డెర సంఘం తిరుపతి జిల్లా కమిటీ ఎన్నిక


నూతన కమిటీని సన్మానిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి-తిరుపతి (మంగళం): వడ్డెర సంఘం తిరుపతి జిల్లా కమిటీని మంగళం లోని ఓ ప్రైవేటు ఫంక్షన్ హాల్ లో వడ్డెర సంఘం రాష్ట్ర అధ్యక్షులు, మాజీ వడ్డెర కార్పొరేషన్ రాష్ట్ర ఛైర్మన్ దేవళ్ల మురళి ఆదివారం ప్రకటించారు. ఈ సందర్భంగా జిల్లా కార్యవర్గ సమావేశాన్ని నిర్వహించి రాష్ట్రంలో కొలువుదీరిన కూటమి ప్రభుత్వం వడ్డెరల సంక్షేమానికి అందించే పథకాలను, చేకూరే లబ్ధిని సభ్యులకు వివరించారు. బీసీల పక్షపాతిగా పేరుందిన సీఎం చంద్రబాబు గతంలో కూడా పనిముట్లను అందించి వడ్డెరల సంక్షేమానికి పెద్దపీట వేశారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వడ్డెర కులవృత్తిదారులకు, చేతి వృత్తుదారులకు రూ.8,870 కోట్ల రూపాయలను మంజూరు చేస్తోందన్నారు. ఉమ్మడి 13 జిల్లాలలో ఈడీలతో సమావేశాన్ని నిర్వహించిందని, వడ్డెర కులవృత్తిదారులకు పనిముట్లతో పాటు, యంత్రాలను అందించాలనే ఆలోచనలో ప్రభుత్వం ఉందన్నారు. వడ్డెరలను ఎస్టీ జాబితాలో చేర్చాలా? ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఎస్టీ జాబితాలో చేర్చడంతో వడ్డెరలు విద్య, ఆర్థికంగా, రాజకీయంగా ఎదగడానికి అవకాశాలు ఏర్పడతాయన్నారు. రాష్ట్ర కమిటీ ఉపాధ్యక్షుడిగా మోహన్, తిరుపతి జిల్లా గౌరవ అధ్యక్షులుగా బత్తల ఆదినారాయణ, అధ్యక్షులుగా గుంజి మదన్మోహన్, మహిళా అధ్యక్షురాలు గీత, ప్రధాన కార్యదర్శిగా దేవళ్ల రమణ, ఉపాధ్యక్షులుగా నాగరాజు, చిత్తూరు జిల్లా అధ్యక్షులుగా సింగపూర్ రవి, 22 మందితో తిరుపతి జిల్లా కమిటీని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో వడ్డెర సంఘం రాయలసీమ అధ్యక్షులు దేవళ్ళ శ్రీనివాసులు, నాగరాజు, జగన్నాథం, దేవళ్ళ కుప్పయ్య, గుంజి కోటి స్వామి పాల్గొన్నారు.

ఆయకట్టు ప్రసిడెంట్‌గా జగన్నాథం నాయుడు



ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: బోనుపల్లి ఆయకట్టు ప్రసిడెంట్‌గా గాలి జగన్నాథం నాయుడు ఏకగ్రీవంగా గెలుపొందారు. కాళంగి రిజర్వాయర్ పరిధిలోని బోనుపల్లి టీసీ(3)కింద బోనుపల్లి, కంచనపల్లి, తుమ్మలగుంటలు ఆయకట్టు గ్రామాలుగా ఉన్నాయి. శనివారం నిర్వహించిన ఎన్నికల్లో జగన్నాథం నాయుడు మాత్రమే నామినేషన్ దాఖలు చేయడంతో ఆయన ఎన్నిక ఏకగ్రీవమైంది. ఎన్నికల అధికారి సురేష్ ఆయనకు నియామక పత్రం అందించారు. బోనుపల్లి ఆయకట్టు పరిధిలోని రైతుల సంక్షేమానికి తనవంతు పాటు పడతానని జగన్నాథం నాయుడు అన్నారు.

వైద్య శిబిరానికి విశేష స్పందన

ప్రజాశక్తి -కోట : కోట మండలంలోని జనతా క్లినిక్ ఆసుపత్రి డాక్టర్ జగదీష్, డాక్టర్ ఉమేరా ఆధ్వర్యంలో ఆదివారం వాకాడులో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఈ శిబిరంలో డాక్టర్ ఉమేరా అన్ని వయసుల రోగులకు పరీక్షించి మందులు పంపిణీ చేశారు. ఉచిత వైద్య శిబిరానికి హాజరైన రోగులకు సీజనల్ జ్వరాల నివారణకు తీసుకోవలసిన జాగ్రత్తలను క్షుణ్ణంగా వివరించారు.ఈ క్యాంపులో బిందు, జనని, తదితర జనతా క్లినిక్ సిబ్బంది పాల్గొన్నారు.


వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టరు ఉమేరా

యోగి ఆదిత్యనాథ్‌ను కలిసిన మాధవుల నాయుడు

ప్రజాశక్తి - పిచ్చా టూరు: పిచ్చా టూరు మండలంలోని గోవర్ధనగిరి గ్రామానికి చెందిన టిడిపి జాతీయ ఉపాధ్యక్షులు, అండమాన్ టిడిపి వ్యవహారాలు ఇన్‌ఛార్జ్ వెంపటి మాధవ నాయుడు, విజయనగరం ఎంపీ అప్పలనాయుడు ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ నీ లక్నోలో మర్యాదపూర్వకంగా కలిశారు.

పద్ధతి మార్చుకోకపోతే తాటతీస్తా: సీఐ

ప్రజాశక్తి- ఏర్పేడు : పద్ధతి మార్చుకోకుంటే తాట తీస్తానని ఏర్పేడు సీఐ జయచంద్ర ఆదివారం మండల పరిధిలోని రౌడీలకు స్ట్రాంగ్ వార్నింగ్ ఇచ్చారు. మండల పరిధిలో రౌడీయిజం, అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. అందరూ సత్ప్రవర్తలతో మెలగాలని ఆదేశించారు. ప్రతి వ్యక్తిపై పర్యవేక్షణ నిఘా ఉంటుందని చెప్పారు. పద్ధతి మార్చుకోకపోతే తాటతీస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఏర్పేడు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

సాగునీటి ఎన్నికల్లో కూటమి గెలుపు

ప్రజాశక్తి - పిచ్చాటూరు: సాగునీటి సంఘాలకు నిర్వహించిన ఎన్నికల్లో 100 శాతం ఏకగ్రీవంగానే అధ్యక్ష, ఉపాధ్యక్షులను ఎన్నుకున్నారు. అన్ని సంఘాలూ ఎన్డీయే కూటమి ఖాతాలోకే వచ్చాయి. రాష్ట్ర టిడిపి ఆదేశాల మేరకు, సత్యవేడు నియోజకవర్గ ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం పిలుపు మేరకు పిచ్చాటూరు క్లస్టర్ ఇన్‌ఛార్జి డి.ఇళంగోవన్ రెడ్డి ఆధ్వర్యంలో పిచ్చాటూరు మధ్యతరహా నీటి సంఘాలు 2 చిన్న తరహా నీటి పారుదల సంఘాలు తొమ్మిది ఏకగ్రీవమయ్యాయి.